# నీలవేణి నీళ్ళోసుకుంది

శంకరమంచి పార్ధసారథి

" ఏమిటీ మధ్య కథల్రాస్తున్నావుటగా " అని అడిగాడో మిత్రుడు.

" అవును "

" ఇప్పటికెన్ని రాశావు ?"

" పది "

" ఎన్ని తిరిగొచ్చాయ్ ? "

వ్యంగ్యంతో కూడిన ప్రశ్న.

" పదకొండు ! "

" అదేవిటి –పదిరాసి పింపిస్తే పదకొండు తిరిగొచ్చాయా ? అంటే పత్రికలవాళ్ళు ఈమధ్య కొసరు గూడా పంపిస్తున్నారా ? "

అదేమో నాకు తెలీదు. ఎలా వచ్చిందో గూడా తెలీదు. కానీ కథ ఎక్కువచ్చిన మాట మాత్రం వాస్తవం "

రెండు క్షణాలు మౌనం.

" నువురాసిన అన్ని కథల్లోకి నీకు వచ్చిన ఒక కథ చెప్పు వింటాను ."

" నే రాసిన పది కథలకన్నా – ఆ పదకొండో కథ చాలా బాగుంది ? "

" మరి పబ్లిష్ కాలేదే ? "

" చెప్పాగా చాలా బావుందని "

" సరే అదే చెప్పు వింటాను "

" మధ్యలో నన్నాపకు. చివరి దాకా విను "

" అలాగే మొదలెట్టు "

" అనగనగా ….. "

" నేనేం చిన్న పిల్లాడిని కాదు, పెళ్ళయి , ముగ్గురి పిల్లల తండ్రిని. సరాసరి కథలోకెళ్ళి సూటిగా చెప్పు "

" ఆల్ రైట్ …..విను "

☆ ☆ ☆

నీలవేణి నీళ్ళోసుకుంది.

ఈంటే ఆమాటకర్థం , ఆమె రోజూ స్నానం చెయ్యదని ఎంత మాత్రం కాదు. ఆమె రోజూ స్నానం చేస్తుంది. కానీ ఒంటిపూట మాత్రమే !

సాయంకాలం పూట స్నానం చెయ్యరాదని ఆమె గట్టిగా అనుకుంది.

ఆమె అలా అనుకోవటానికి, ఆ నిర్ణయం తీసుకోటానికి చాలా బలమైన కారణాలున్నాయి. ఆ కారణాలేమిటో ..... అదిగో వస్తున్నాడు .... ఆ చిట్టిబాబుని చూస్తే ఇట్టే అర్థం అవుతుంది.

చిట్టిబాబుకి పాతికి సంవత్సరాలొచ్చిఇనా, అతడిని చూస్తే తొందర పడి ఎదిగేసిన పదేళ్ళ కుర్రాడిలా వుంటాడు. అతడు ధరించిన ప్యాంటు( అని మీరొప్పుకుంటేనే సుమా ! ) దూరాన్నించి వీక్షిస్తే లుంగీలా వుంటుంది. పొట్టిచేతుల చొక్కా అని పేరేగాని చూట్టానికి " ఫుల్‌హ్యాండ్స్ " చొక్కాలాగే ఉంటుంది. చొక్కాని ఎందుకంత పొడుగ్గా కుట్టిస్తావని మీ లాంటి విజ్ఞులడిగితే ఎదిగే పిల్లాడివి చొక్కా పొడుగ్గా కుట్టించుకోవాలని మా అమ్మ చెప్పింది ' అంటాడు. కాలికున్న చెప్పులు చూస్తే కాటికి కాళ్లు చాపు కూర్చున్న వాళ్ళ నాయనమ్మ గుర్తుకొస్తుంది. ప్రతి సోమవారం మాత్రమే తలకి నూనెరాయాలన్నది వాళ్ళమ్మ చేసిన అలవాటు.

నీలవేణి పెళ్ళికి పూర్వం చిట్టిబాబుని సరిగా చూడలేదు. చూసుంటే చేసుకునేది కాదా అని మీరడక్కండి. చూసినా చేసుకునేదే – చేసుకోక ఛస్తుందా. ఆమె ఇంటి పరిస్థితి అలాంటిది. కానీ పెళ్ళికి పూర్వం ఆమె రాబోయే భర్త రూపాన్ని గుండెలో వ్రేలాడదీసుకుంది. ఆ రూపానికి, చిట్టిబాబు స్వరూపానికి పొత్తుకుదరక , చాలా మదనపడి, చివరకి అతగాడిని మార్చాలని, మార్చి తన హృదయంలో వున్న రూపం తాలూకు రంగులన్నీ చిట్టి బాబుకి పూయాలని కంకణం కట్టుకుంది.

ఆ శపథం నేరవేర్చుకునే ప్రయత్నంలోని మొదటి మెట్టే సాయంకాలం పూట స్నానం చెయ్యకుండుట దీనికి వేరే కారణముంది.

తల్లి బిడ్డకి ఆకలెరిగినట్లు, భార్య భర్త బలహీనత లెరుగు.

చిట్టిబాబుకి ఓ చిన్న ఆశ, కోర్కె వున్నాయి. తను ఆఫీసునుంచి వచ్చేసమయానికి, తన భార్య శుభ్రంగా స్నానంచచేసి, తెల్ల చీరకట్టుకుని , తల నిండా మల్లెపూలతో, కళ్ళలోని ఆప్యాయత, కోర్కెలతో తనకి స్వాగతం చెప్పాలి.

నీలవేణి ఈ విషయాన్ని ఎలా పసిగట్టిందో తెలీదుకానీ మొత్తానికి తెల్సుకుంది.

మనం పూర్తిగా ఆ దంపతుల మధ్యకు వెళ్ళేముందు , ఒక్కసారి చిట్టిబాబు దినచర్యని గమనించటం చాలా అవుసరం.

చిట్టిబాబు ప్రతిరోజు చుక్కపొడవకముందే నిద్రలేచి, కోడిని నిద్రలేపి, తనెళ్ళి నూతి దగ్గర స్నానం చేస్తాడు. ( నీలవేణి వేడి నీళ్ళిస్తానన్నా ఒప్పుకోడు ). అటు తర్వాత సంధ్యావందనం పూర్తిచేసి, అష్టోత్తరాలు, సహస్రనామాలు గూడా పూర్తిచేసుకుని బయటపడి కాసేపు భజన కీర్తనలు గళమెత్తి గానం చేస్తాడు.

దెబ్బతో భార్య, తల్లిలేచి పనుల్లోకి దిగుతారు. పిమ్మట తల్లి అందించిన కాఫీని సేవించి, గుళ్ళోకెడతాడు. అక్కడ దైవదర్శనం పూర్తిచేసుకుని, విభూది, కుంకుమలతో తన సుందర వదనాన్ని అలంకరించి, పూజారిచ్చిన పూలని భక్తితో చెవులసందున ఇరికించుకుని ఇంటి దారిపడతాడు. వెంటనే తల్లి వడ్డించగా సుష్టుగా భోజనం చేసి శ్రీ శ్రీ చిట్టిబాబులవారు కొలువుచేయ తరలి వెడతారు.

ఇక సాయంత్రం ఆఫీసునుంచి రాగానే మళ్ళీ స్నానం పూర్తిచేసి ( నూతినీళ్ళే ! ) తల్లితో పాటుగా పురాణ కాలక్షేపానికి వెడతాడు. రాత్రి తొమ్మిదింటికి తిరిగొచ్చి భోజనం ముగించి.....

అక్కడాగండి – ఇప్పటకీ చిట్టిబాబు దినచర్య పైన చెప్పిన విధంగా నడుస్తూనే వుంది. కానీ అటు పిమ్మట జరిగే వాటిలోనే కాస్త మార్పు సంభవించింది.

గతంలో అయితే భోజనం ముగించి కాసేపు తల్లితో పురాణ విశేషాలు, విశిష్టత చర్చించి తర్వాత పడకగదిని చేరేవాడు అప్పటికి నీలవేణి వంటింటి పన్లు పూర్తిచేసుకుని వచ్చేది. అప్పుడు చిట్టిబాబు చేతినిండా దద్ధోజనం దొరికిన భక్తుడిలా సంబరపడిపోయి, భార్య వడిలో వాలిపోయేవాడు. కానీ ఈ మధ్య ఈ కార్యక్రమానికి అంతరాయం ఏర్పడింది – కారణం నీలవేణి నిర్లిప్తత.

చిట్టిబాబు దగ్గిరకొస్తే “ అబ్బ నా దగ్గిరకి రాకండి. ఈ పూట స్నానం చెయ్యలేదు. చిరాగ్గావుంది ” అనటం మొదలెట్టింది.

“ స్నానం ఎందుకుచెయ్యలేదు ” అని అడిగే దమ్ము అతడికి లేదని ఆమెకు బాగా తెల్సు. ఆ మాట విన్న చిట్టిబాబుకి ఒక్కసారిగా నూతిలోని చల్లటినీళ్ళు గుర్తుకొచ్చి అటుతిరిగి పడుకోసాగాడు.

అలా మొదలైన చిరాకు ఆమెకి అలవాటుగా మారి, శ్రోతలు కోరని పాటలా నిత్యము వినపడసాగింది.

దాంతో చిట్టిబాబు తల్లడిల్లి పోయాడు. దిగులుపడ్డాడు. బాధపడ్డాడు – భయపడ్డాడు.

పోగా పోగా చిట్టిబాబు అదే ధ్యాసలో పడిపోయి ఇపుడు సాయంత్రం పూట రాగానే భార్యని ఆత్రంగా అడుగుతాడు ! ‘ స్నానం చేస్తున్నావావా ? ’ అని.

ఆమె ‘ ఊ ’ అంటే ఆ రోజుకి తనని కరుణించినట్టు అతడికి గుర్తు.

కానీ ఆమె “ చెయ్యను, చెయ్యదల్సుకోలేదు ” అంటుంది., విన్న చిట్టిబాబు చిన్న బుచ్చుకునేవాడు.

అత్తగారు నోరు నొక్కుకుంటూ “ అదేవిటే . ఇప్పుడు వాడేమన్నాడని అంత ఇదయిపోతున్నావ్ ? స్నానం చెయ్యమన్నా తప్పేనా ? ” అనేది ఆ దంపతుల మూగబాష అర్థంకాక ఇపుడు ఆ భార్యాభర్తల మధ్య జరుగుతున్న తతంగం గమనిద్దాం రండి ....

“ అదేవిట్రా నాయనా అలావుంటున్నావ్ – గడ్డం మాసింది. తల దువ్వుకోలేదు – నీరసంగా కన్పిస్తున్నావ్ – ఒంట్లో బాగాలేదా ” ఆదుర్దాగా అడిగింది ముసలితల్లి.

“ ఒంట్లో బాగానే వుంది. మనసే బాగాలేదు ” అన్నాడాతనయుడు నిరుత్సాహంగా అంతకు ముందే భార్య అన్న‘ స్నానం చెయ్యనన్న ’ మాటని తల్చుకుంటూ.

“ పురాణానికి రావా ? ఇవ్వాళ యుద్ధం ( కాండ ) మొదలెడతారట ” అడిగింది తల్లి.

“ నే రాను – నువ్వెళ్ళు ” విసుగ్గా అన్నాడు.

అత్తగారు గొణుక్కుంటూ వెళ్ళి పోగానే నీలవేణి కాఫీతో రంగప్రవేశం చేసి, ‘ కాఫీ తీసుకోండి ’ అంది.

చిట్టిబాబు మొహం చిట్లించి ‘ అక్కర్లేదు ’ అన్నాడు.

నీలవేణి నవ్వుకుంది ‘ పర్లేదు, తీసుకోండి ’ అంటూబలవంతానా చేతికందించింది.

చిట్టిబాబు మౌనంగా సంతోషంతో కాఫీ సేవిస్తుండగా నీలవేణి అంది ‘ చూశారా ’ ,గుళ్ళో కెళ్ళకపోతే మనకి మాట్లాడుకోటానికి ఎంత వ్యవధో ! అబ్బ ! ఎంత హాయిగా వుంది ఈ ఏకాంతం ’

చిట్టిబాబుకి నిజమేననిపించింది. భార్యవంక చూశాడు ఆశగా.

“ అందుకని రేపట్నించి గుళ్ళో కెళ్ళటం మానెయ్యాలి ? అయినా గుళ్ళోకెళ్లే వయసా మీది ? ‘ ప్రశ్నించింది భర్తని మృధువుగా తాకుతూ.

చిట్టిబాబు తత్తరపాటుతో “ సరే సరే. అలాగే ” అన్నాడు. ‘ అసలు మొగాడంటే ఎలా వుండాలో తెల్సా ? ” గోముగా అంది.

“ ఎలా వుండాలి ” అన్నట్టు చూశాడు భార్యవంక నీలవేణి, భర్తకి సమీపంగా కూర్చొని మొగాడంటే ఎలా వుండాలో చెప్పనారంభించింది.

☆ ☆ ☆

వారం రోజుల తర్వాత చిట్టిబాబు ఆఫీసునుంచి వచ్చాడు ఎలా వచ్చాడు అంటే పూర్తిగా మారిపోయివచ్చాడు.

ఇప్పుడు తొడుక్కున ఫ్యాంటు లుంగీలా వున్నప్పటికీ నాగరీకంగా వుంది. పూర్తిచేతుల చొక్కా తొడిగాడు. హిందీ హీరో కటింగ్ చేయించిన క్రాపు నూనె లేకపోయినా అందంగా వుంది.

వేసుకున్న ఎత్తుమడమల బూట్లు, ఫ్యారెక్స్ బేబీలా ఆరోగ్యంగా వున్నాయ్.

ఆరోజు ఇంటికొచ్చిన చిట్టిబాబు నాగరికంగా ఫ్యాంటుని పైకి లాక్కుంటూ గర్వంగా భార్యవంక చూస్తూ ధైర్యంగా అడిగాడు " స్నానం చేస్తున్నావా ? " అని.

నీలవేణి నవ్వి ' ఇప్పుడే పోసుకున్నా రండి టిఫిన్ తిందాం ' అంటూ చెయ్యిపట్టి వంటింట్లోకి లాక్కెళ్ళింది. అతడి ముసలి తల్లికి మాత్రం అంతా అయోమయంగా వుంది. కొడుకు ఎందుకిలా తగులడుతున్నాడో ఆమెకెంతమాత్రం అర్థం కావటంలేదు.

చింతకాయల చిట్టిబాబు అన్న నిక్షేపంలాంటి పేరుని కాదని ' సి.వి.బాబ్ ' అన్న పేరుతో బోర్డుని బయట ఎందుకు వ్రేలాడ తీశాడో కూడ ఆవిడకి అర్ధం కాలేదు.

ఆ సంవత్సరమే నీలవేణి నీళ్ళోసుకుంది !

☆ ☆ ☆

" ఈ కథేనా నీకు అంతబాగా నచ్చింది "

" అంత విషయం ఏముందని నచ్చటానికి "

" ఆడది తల్చుకుంటే మొగాడిచేత ఎన్ని వేషాల్ " వేయించగలదో అర్థం అవుతుంది దద్దోజనం లాంటి వాడిని గూడా ఆటంబాంబులా తయారు చెయ్యగలదు చమురు కాళ్ళ వెధవని గూడా బహుచమత్కారిగా మార్చగలదు అలాగే చాకులాంటి వాడిని చవటగా కూడా చెయ్యగలరు.

వాళ్ళకత్తికి రెండు వైపులా పదునుంది అందుకే నాకు చాలా నచ్చింది "

" బావుంది – నీ టేస్టు నీది నేవెళ్ళొస్తా – కానీ వెళ్ళేముందు ఒక మాట – నే తొడుక్కున్న ఈ బెల్ ఫ్యాంటు, షర్టు నాకోసం నేనే ఇష్టపడి తొడుక్కున్నా నా భార్య ప్రోద్బలంతో కాదు వస్తా ".

నేను నవ్వలేకుండా వుండలేక పోయాను. అందుకే  నవ్వేశాను. మీరు నవ్వుతారా ? ఓ.కే నవ్వండి …. నవ్వేయ్యండి….

--------అయ్యిపోయింది --------